నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నేను బీఏ చదివాను. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి తప్పనిసరిగా ఇవ్వాలి. గతంలో ఇస్తామని ఇవ్వలేదు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడానికి ప్రతి నెలా రూ.3 వేల భృతి వెంటనే అమలు చేయాలి.

– నాగం శ్రీహరి కృష్ణ, నాగరత్నం కాలనీ

ఇచ్చిన హామీకి కట్టుబడాలి



గత టీడీపీ ప్రభుత్వం చేసిన విధంగా కాకుండా కూటమి ప్రభుత్వం ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని తప్పని సరిగా అమలు చేయాలి. నేను ఇంటర్మీడియెట్ చదివి ఐటీఐ చేశాను. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నిరుద్యోగ భృతిపై కేసులు వేయడంతో నిలిచిపోయింది. ఆ పరిస్థితి లేకుండా భృతిని అమలు చేయాలి. నిరుద్యోగ భృతి అందించి ఆర్థికంగా ఆదుకోవాలి. ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలి.

– కుంది నాగేంద్ర బాబు, సింగవరం

రైతులను ఆదుకోవాలి



గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ నాటికి రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అయ్యేది. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక పెంచిన పెట్టుబడి సాయం రూ.20వేలు అందుతుందన్న ఆశతో ప్రతి రైతు ఉన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి రెండు వేలు మాత్రమే జమ అయ్యింది. ఇప్పటికే విత్తనాలు, ఎరువుల కోసం రైతులు అప్పులు చేశారు. ప్రభుత్వం స్పందించి అన్నదాతలను ఆదుకోవాలి.

– నల్లమిల్లి వెంకటరెడ్డి, రైతు, బలభద్రపురం

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో?



ఆర్టీసీ బస్సులలో మహిళలకు ప్రయాణం ఫ్రీ అని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఎన్నికల సమయంలో పదే పదే చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఇదిగో, అదిగో అంటున్నారుగానీ, అమలు చేయడం లేదు. పక్కనే ఉన్న తెలంగాణ సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలులో పెట్టింది. ఏపీలో చెప్పడం వరకే, చేయడం చేతకాదన్నట్టుగా పాలకుల తీరు ఉంది. చెప్పింది చేయడం జగన్‌కే సాధ్యం. అందరి వల్ల అయ్యేది కాదు.

– శిరిగినీడి మల్లిక, ముక్కినాదపాళెలు, రాజానగరం మండలం

నాడు నేనున్నానంటూ భరోసా




వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా రాష్ట్రంలో ఐదు సంవత్సరాల పాటు అనేక సంక్షేమ పథకాలను ఎంతో సమర్థవంతంగా లబ్ధిదారులకు సకాలంలో అందజేశారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలతో విద్యకు పెద్దపీట వేశారు. క్రమం తప్పకుండా రైతు భరోసా సొమ్ము అందించి వ్యవ'సాయం' చేశారు. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా ఇలా సమాజంలో అన్ని వర్గాల వారికి పలు సంక్షేమ పథకాలు అందించి నేనున్నానంటూ భరోసా కల్పించారు.


సూపర్ ట్రిక్స్

- అధికారం కోసం కూటమి నేతల హామీలు
- పీఠం ఎక్కాక మొహం చాటేసిన వైనం
- చంద్రబాబు తీరుపై ప్రజల్లో వ్యతిరేకత

రాజానగరం: 'మాట తప్పడం, మడమ తిప్పడం' చేతకాని నేత ఎవరూ అంటే ఠక్కున మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని సమాధానం వస్తుంది. అయితే ఇందుకు పూర్తి వ్యతిరేకం ఎవరూ అంటే ఏమాత్రం తడుముకోకుండా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎవరైనా చెబుతారు. ఈ ఇద్దరి నేతలపై జనంలో ఉన్న అభిప్రాయం ఇది. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు తీరు ఏడు పదుల వయసులో కూడా మారలేదంటున్నారు ప్రజానీకం. ఎందుకంటే గడచిన సార్వత్రిక ఎన్నికలలో 'సూపర్ సిక్స్' పేరుతో ఎంతో గొప్పగా ప్రచారం చేసుకుని, అధికారంలోకి వచ్చేందుకు తోడ్పడిన సంక్షేమ పథకాల గురించి ఉలుకు పలుకు లేకుండా మిన్నకుండటమేనంటున్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే సత్తా లేకనే ప్రతిపక్ష నేతపై లేనిపోని ఆరోపణలు, గత ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని జనం మాటగా వినిపిస్తోంది.




18 ఏళ్లు నిండిన మహిళకు నెలకు రూ.1,500 సాయం



నియోజకవర్గం	లబ్ధిదారులు
రాజానగరం	: 86,995
అనపర్తి	: 1,14,450

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



నియోజకవర్గం	లబ్ధిదారులు
రాజానగరం	: 1,56,855
అనపర్తి	: 1,36,855


ఏటా మూడు సిలిండర్లు ఉచితం



నియోజకవర్గం	లబ్ధిదారులు
రాజానగరం	: 1,42,565
అనపర్తి	: 1,05,325

'తల్లికి వందనం'పై ఇంకా కసరత్తు

గత ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమిలో ఉన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్ 'తల్లికి వందనం' పేరుతో ఇదే పథకాన్ని ఒకటి నుంచి 12 వరకు చదువుకునే ప్రతి విద్యార్థికి రూ. 15 వేల చొప్పున వారి తల్లుల అకౌంట్లలో జమ చేయిస్తామంటూ ఊకదంపుడు ప్రచారం చేసి, ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చారు. వచ్చిన తరువాత మీనమేషాలు లెక్కిస్తూ, కుటుంబానికి ఒక్క విద్యార్థికేనంటూ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేయబోయారు. ఈ సమయంలో ముందుగానే 'సాక్షి' ద్వారా ప్రజలను చైతన్యపర్చడంతో చెప్పిన మాటకు కట్టుబడి ఉంటామని, పథకం అమలుపై కసరత్తు చేస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారు.




జగన్ పాలనలో రైతు భరోసా సాయం

నియోజకవర్గం	రైతులు	రూ.కోట్లు
రాజానగరం	30,470	17
అనపర్తి	20,792	11.68

కూటమి పాలనలో సాయం కోసం చూస్తున్న రైతులు

నియోజకవర్గం	లబ్ధిదారులు
రాజానగరం	: 30,470
అనపర్తి	: 20,792



జగన్ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందిన సాయం

నియోజకవర్గం	లబ్ధి (కోట్లలో)
రాజానగరం	: 81,449 మందికి రూ.122.17 కోట్లు
అనపర్తి	: 89, 618 మందికి రూ. 134.42 కోట్లు

కూటమి పాలనలో సాయం కోసం చూస్తున్న తల్లులు

నియోజకవర్గం	లబ్ధిదారులు
రాజానగరం	: 41,254
అనపర్తి	: 43,789

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి



నియోజకవర్గం	లబ్ధిదారులు
రాజానగరం	: 72,625
అనపర్తి	: 51,545

'తల్లికి వందనం' ఇవ్వాలి



తల్లికి వందనం పథకాన్ని కచ్చితంగా అమలు జరపాలి. దీనివల్ల పేదవర్గాల పిల్లలు చదువుకోవడానికి ఉపయోగపడుతుంది. పేదింటి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. జగనన్న ప్రభుత్వం పారదర్శకంగా అమ్మ ఒడిని అమలు చేసింది. పేదల పిల్లల భవిష్యత్తుకు దోహదపడింది. ప్రతి సంవత్సరం పాఠశాలలు తెరచిన జూన్ నెలలోనే పథకం అమలవ్వడంతో ఎంతో మేలు జరిగేది. నాకు ఇద్దరు పిల్లలున్నారు. నా కుమారుడు ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి, నా కుమార్తె ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం అమలు విషయమై విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టత ఇవ్వకపోవడం దారుణం. పిల్లల భవిష్యత్తును కాపాడేందుకు ప్రయత్నించాల్సిన పాలకులు నాశనం చేసే విధానాలను అవలంబించడం సరైంది కాదు.

– ఇంజే మణిరత్నం, బూరుగుపూడి

ఉచిత సిలిండర్లు ఎప్పుడో?



ఏడాదికి ప్రతి ఇంటికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని టీడీపీ కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఆ పథకం ఎప్పుడు నుంచి అమలు చేస్తారో చెప్పాలి. రాష్ట్ర నేతలతో పాటు స్థానిక అభ్యర్థులు ఈ అంశంపై ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు కావొస్తున్నా ఇప్పటి వరకూ దాని ఊసే మరచిపోయారు. పేదలందరం గ్యాస్ సిలిండర్లు, ఎప్పుడు ఇస్తారోనని ఎదురుచూస్తున్నాం. అధికారంలోకి వచ్చాక ఇంత జాప్యం చేస్తారని అనుకోలేదు. ఇలా చేయడం మంచిది కాదు.

– కదియాల భూలక్ష్మి, పెదపూడి

హామీపై స్పష్టత ఇవ్వాలి



ఎన్నికల ముందు 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన మహిళలకు నెల రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీపై ఏ నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికైనా హామీపై స్పష్టత ఇవ్వాలి.

– నితిపూడి గౌతమి, మర్రిపూడి

క్లుప్తంగా

రైతుల బ్యాంక్ ఖాతాలో సబ్సిడీ జమ



వంగలపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీతానగరం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎరువులు, మొక్కల సబ్సిడీని రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేశామని ఉద్యానవన అధికారి రెనీ తెలిపారు. బుధవారం వంగలపూడిలో కొయ్యలమూడి పరమేశ్వరరావు పామాయిల్ తోటలో పెద్దాపురానికి చెందిన పతంజలి ఫుడ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన అధికారి రెనీ డ్రిప్ సబ్సిడీల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పతంజలి కంపెనీ డీజీఎం ఏఎస్ ప్రకాష్ మాట్లాడుతూ రైతుల తోటలకు సకాలంలో ఎరువులు పెట్టి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్ లిమిటెడ్ సిబ్బంది డీఎస్ శ్రీనివాస్, ఎం.నాగేశ్వరరావు, పి.వీరబాబు, టెక్నికల్ ఆఫీసర్ కార్తీక్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



రాజుపాలెంలో కాలువలో చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న అధికారులు

పెదపూడి: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ రెడ్డి అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రెండో రోజు ఆయన పెదపూడి, రాజుపాలెం, కరకుదురు, తదితర గ్రామాల్లో పర్యటించారు. వచ్చే నెల 2 వరకూ నిర్వహించే ఈ కార్యక్రమాల్లో అంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు సుంకర వీరస్వామి, మన్యం శ్రీనువాసు చౌదరి, వీఆర్వోలు పంపన శ్రీను, చండీ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతింటున్న ఓజోన్ పొర



ఓజోన్ పొరపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు డాక్టర్ మాధవ్

సీతానగరం: మానవాళిని, ప్రాణికోటిని కాపాడే ఓజోన్ పొర క్రమేపీ దెబ్బతింటుందని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు తెలిపారు. బుధవారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో రసాయన శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్, నీటి సంరక్షణ దినోత్సవాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ పంచభూతాలైన నింగి, నీరు, నేల, నిప్పు, గాలి మనను ప్రకృతి రూపంలో పరిరక్షిస్తున్నాయని, సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి మానవాళిని, ప్రాణికోటిని కాపాడే ఓజోన్ పొర క్రమేపీ శిథిలమవుతోందని, గ్రీన్‌హౌస్ వాయువులైన మీథేన్ మొదలైన వాటి వాడకం తగ్గిస్తే భూమి పరిశుభ్రమవుతుందన్నారు. రసాయనశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మాధవ్ మాట్లాడుతూ నీటిని అవసరమైనంత వరకే వాడాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ సుధామయి మాట్లాడుతూ కోట్లాది సంవత్సరాల నుంచి భూమి పొరల్లో శుద్ధి అయిన నీటిని మనం సరిగా వాడుతూ తర్వాత తరాలకు అందించాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, సుబ్బారావు, వాణి, వెంకటేష్, అలేఖ్య, మనోహరి, ఫణీంద్ర, లైబ్రేరియన్ శివదుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

కోరుకొండలో కుక్కల పట్టివేత

సాక్షి ఇంపాక్ట్

మధురపూడి: కోరుకొండ మండలంలో కుక్కల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో 'సాక్షి' కథనానికి ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. పిక్కలు కొరికేస్తున్న కుక్కలు కథనం సాక్షి పత్రికలో ప్రచురితమవడంతో అరికట్టే చర్యలను బుధవారం చేపట్టింది. ఎంపీడీఓ నరేష్‌కుమార్ ఆదేశాల మేరకు చర్యలు మొదల య్యాయి. మండలకేంద్రమైన కోరుకొండ పంచాయతీ పరిధిలో కార్యదర్శి రమేష్‌బాబు కొందరు సభ్యులతో టీమ్‌ను ఏర్పాటు చేశారు. 3 రోజుల్లో కుక్కలు లేని కోరుకొండ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దానిలో భాగంగా బుధవారం 175 కుక్కలను పట్టుకున్నారు. వీటిని ఏజెన్సీ ప్రాంతంలో విడిచిపెట్టనున్నారు. కోరుకొండ మెయిన్‌రోడ్డు, బస్‌స్టాండ్ సెంటర్, శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం రోడ్డు, అంకాలమ్మ గుడి, పంచాయతీ కార్యాలయం, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో సంచరించే కుక్కలను పట్టుకున్నారు.



కోరుకొండలో పట్టుకున్న కుక్కలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న సభ్యులు

85 మందికి వైద్య సేవలు



జంభూపట్నంలో పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మధురపూడి: కోరుకొండ మండలంలో 85 మంది పారిశుధ్య కార్మికులకు బుధవారం వైద్యసేవలందించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ప్రథమ చికిత్స కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పిలుపులో భాగంగా 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిని పురస్కరించుకొని పంచాయతీ కార్యాలయాల్లో పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహించి, ప్రథమ చికిత్సను వైద్యులు అందజేశారు. మండలంలోని పలు పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో సుమారు వంద మంది కార్మికులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా జంభూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పని తప్ప ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చే అవకాశం లేదన్నారు. వారి ఆరోగ్య భద్రతకు ఈ కార్యక్రమం ఉపయోగపడిందన్నారు.

సర్వసిద్ధి ప్రదాయ నమో నమః

బిక్కవోలు: వినాయకా.. సర్వసిద్ధి ప్రదాయ నమో నమః అంటూ ఆ స్వామిని భక్తులు కొలిచారు. తొస్సిపూడిలోని పెద్ద వీధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో శ్రీవరసిద్ధి వినాయకుడిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. ఉప సర్పంచ్ ద్వారంపూడి వీరవెంకట రామారెడ్డి (తంబీ), మేడపాటి దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: స్థానిక వైఎస్సార్ జంక్షన్‌లోని ఉత్సవ మండపంలో కొలువుదీరిన వినాయక విగ్రహాన్ని రాజమహేంద్రవరం గోదావరిలో నిమజ్జనం చేసేందుకు ట్రాక్టరుపై ఊరేగిస్తూ సందడి చేశారు.

పెదపూడి: అనపర్తి ధరణికోటలోని సంపత్ వినాయకుడిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆలయం వద్ద శాశ్వత అన్నదాన నిమిత్తం చిర్ల వీర్రాఘవరెడ్డి దంపతులు రూ.4 లక్షల విరాళం అందజేశారు. ఆ దంపతులకు మాజీ ఎమ్మెల్యే దుశ్శాలువా వేసి సత్కరించారు. 54 కిలోల స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని రూ.33,555కు సాయి గౌతమ్ రెడీమేడ్స్ అధినేత నల్లమిల్లి వీవీఎస్ఎన్ రెడ్డి (సతీష్) దక్కించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా పాటదారునికి లడ్డూను అందజేశారు. చిర్ల సతీష్, చిర్ల వరలక్ష్మి, నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: సంపరలోని పంట కాలువ సమీపంలో సిద్ధి వినాయకునికి పంచామృతాభిషేకాలు, గరికి పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. సంపర, కాండ్రేగుల, జి.మామిడాడ, పెదపూడి గ్రామాల్లో నెలకొల్పిన గణనాథులను సమీప కాలువల్లో నిమజ్జనం చేశారు.



తొస్సిపూడిలో వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



రాజానగరంలో గణేశ విగ్రహ ఊరేగింపు



అనపర్తిలో వీవీఎస్ఎన్ రెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



జి.మామిడాడలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

పెదపూడి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడ డీఆర్‌కే రెడ్డి కళాశాల ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా ఎంపికలు బుధవారం జరిగాయి. ఎంపీపీ తులసి, ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ, డీఆర్‌కే రెడ్డి విద్యా సంస్థల అధినేత డీఆర్‌కే రెడ్డి, పీడీ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా ఎంపికలు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, త్రోబాల్, వాలీబాల్ తదితర విభాగాల్లో 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలు ఈ నెల 20న అనపర్తి నిర్వహించే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలను ఎంపీడీఓ వెంకటరత్నం ప్రారంభించారు. బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, తదితర పోటీలు నిర్వహించారు. ఎంఈఓ పి.మధుసూదనరావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మండల స్థాయి టోర్నమెంట్ ప్రారంభం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

రాజానగరం: మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని ఎంపీపీ మందారపు సీతారత్నం అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి టోర్నమెంట్స్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ప్రారంభమయ్యాయి. 20వ తేదీ వరకు జరిగే ఈ పోటీలలో వాలీబాల్, కోకో, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్సు అండర్ 14, అండర్ 17 విభాగాలలో బాల, బాలికలకు వేరువేరుగా జరుగుతాయని కన్వీనర్లుగా వ్యవహరిస్తున్న ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, పీఈటీలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకలో పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. బొబ్బిల్లంక ప్రభాకర్‌నగర్ శివారున ఏటిగట్టుపై పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,880 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.